


# హైదరాబాద్ వార్త


## విద్యాలయాల్లో భద్రత డొల్ల..!

- ఇరుకు గదుల్లోనే తరగతి గదులు
- నాలుగైదు అంతస్తుల భవనాలకు మెట్లే దిక్కు
- అగ్నిమాపక వాహనం పోయే దారి లేదు





**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** నగరంలో ప్రైవేట్ స్కూళ్లు పేరెంట్ స్ కు టెన్షన్ పెట్టిస్తున్నాయి. విద్యార్థులు స్కూలుకు వెళ్ళి ఇంటికి తిరిగొచ్చేదాక తల్లిదండ్రులకు భయాందోళన ఉంటుంది. ఇటీవల స్కూల్లు ప్రారంభం కావడం, పలు ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఘటనలను చూస్తే తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తల్లి దండ్రులు పిల్లల భద్రత విషయం పెద్దగా పట్టించుకోకుండా పాఠశాలకు పంపుతున్నారు. పాఠశాలల్లో ఏదైనా అనుకోని అగ్నిప్రమాదం జరిగితే వారి భద్రత ఎంత వరకు పదిలం అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఏమీ జరగనంత వరకు భాగానే ఉంటుంది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే బడిలో బాల్యానికి భరోసా ఉంటుంది. నగరంలో జిప్లస్ నుండి మొదలుపెడితే జీప్లస్4వరకు బహుళ అంతస్తుల్లో ప్రైవేట్ ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో, కనీసం వాహనం కూడా లోపలికి వెళ్ళలేని ప్రాంతాల్లో ఇలాంటి బహుళ అంతస్తుల భవనాల్లో పాఠశాలలను నిర్వహిస్తున్నారు. వేలమంది విద్యార్థులను ఇరుకు గదుల్లో కుక్కుతున్నారు. ఇలాంటి భవనాల్లో అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే విద్యార్థులు బయటపడే మార్గాలు మాత్రం కనిపిస్తలేవు. పాఠశాలలు గుర్తింపు తీసుకునే సమయంలో, రెన్యూవల్ సమయంలో మాత్రమే ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్ తీసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో అధికార విపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులే యాజమాన్యాలుగా ఉడటంతో వారి నుండి వచ్చే వత్తిడితో నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది.

**విద్యాలయాల్లో కనిపించని అవగాహన కార్యక్రమాలు..**

అగ్నిప్రమాద సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో చాలా విద్యాసంస్థల్లో కనీస అవగాహన కార్యక్రమాలు నిర్వహించట్లేదు. బహుళ అంతస్తుల భవనంలో విద్యాసంస్థ నడపాలంటే ఆభవనం చుట్టూ అగ్నిమాపక వాహనం ప్రయాణించే స్థలం ఉండాలి. కానీ నగరంలోని చాలా సంస్థల భవనాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలతో పోల్చితే ప్రభుత్వ కళాశాలలు విశాలమైన భవనాల్లోనే ఉన్నాయి. అయితే వీటిల్లో వసతుల విషయానికొస్తే అరకొరగానే ఉన్నాయి. 80శాతం భవనాల్లో అగ్నిప్రమాద నివారణ పరికరాలు లేవు. గ్రేటర్ పరిధిలో 30శాతం ప్రైవేట్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బిఈడీ కళాశాలలు మెరుగైన వసతులతో కొనసాగుతున్నాయి. 70శాతం కళాశాలలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. నాలుగైదు అంతస్తుల భవనం ఉన్నప్పటికీ కనీసం విశాలమైన మెట్లు మార్గం కూడా ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## పరిశ్రమలకు..సింగిల్ విండో సిస్టం

- హెచ్‌టి విద్యుత్ కనెక్షన్లు మరింత సులభతరం
- ఆన్‌లైన్‌లోనే ఆటో ఎస్టిమెటేడ్ సిస్టం
- దక్షిణ డిస్కంలో సరికొత్త సాఫ్ట్‌వేర్
- మధ్యవర్తులు లేకుండా దరఖాస్తుకు అవకాశం
- ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా అనుమతి



**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) తమ వినియోగదారులకు సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలను త్వరగా అందించేందుకు గాను ఎప్పటికప్పుడు నూతన విధానాలను ప్రవేశపెడుతుంది. ఈనేపథ్యంలో పరిశ్రమలు, కంపెనీలకు అందిచే హెచ్‌టి 33కెవి సర్వీసు దరఖాస్తుల కోసం ఆటోఎస్టిమేట్ సాఫ్ట్ వేర్ అభివృద్ధి చేసిందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ విధానంలో ముందుగా హెచ్‌టి సర్వీసుకు అందిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసిన తరవాత హై టెన్షన్ కన్స్యూమర్ సర్వీస్ కనెక్షన్ (హెచ్‌టిసిఎస్‌సి) సిస్టమ్ జిఎస్ఐ కోఆర్డినేట్లను సేకరించి ఆవివరాలను సాసా యాప్ ద్వారా డైరెక్ట్‌గా సంస్థ ప్రధాన కార్యాలయం లోని చీఫ్ ఇంజినీర్ కమర్షియల్‌కు పంపుతుంది. సమాచారం కార్పొరేట్ ఆఫీస్‌కు అందగానే సాసాయాప్ ద్వారా నేరుగా ఎస్టిమేట్ రూపొందించబడుతుంది. ఎస్టిమేట్ ఆమోదం తర్వాత డిమాండ్ నోటీసు ఆటోమేటిక్‌గా జనరేట్ అవుతుంది. ఆ వివరాలు వినియోగదారుడికి మెసేజ్, ఈమెయిల్ ద్వారా పంపబడతాయి. ఆటోఎస్టిమేట్ ఆమోదం అయిన విషయాన్ని సంబంధిత ఏడిఈ, డిఈ, ఎస్ఈ ఆపరేషన్ సిబ్బందికి మెసేజ్ ద్వారా తెలియజేయబడుతుంది. ఈ సింగల్ విండో పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియ వలన అతి తక్కువ సమయంలో అన్ని అనుమతులు జారీ అవుతాయి. సేవలు సులభతరం చేసేందుకే: సిఎండీ ముషారఫ్ ఫరూఖీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యూచర్ సిటీ. పరిశ్రమల విస్తరణ వంటి వివిధ అభివృద్ధి పనుల వలన ముఖ్యంగా తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధి ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతుందని అందుకు అనుగుణంగా కొత్త పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల యాజమాన్యాలకు హెచ్‌టి కనెక్షన్లు మరింత సులభంగా అందించేందుకు "ఆటో ఎస్టిమేట్ సాఫ్ట్వేర్ సిస్టం"ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఔత్సహిక పారిశ్రామికవేత్తలు ఈ విధానంలో నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు నేరుగా ప్రధాన కార్యాలయానికి వస్తాయని వాటిని పరిశీలించిన అధికారులు కనెక్షన్ కు సంబందించిన ఎస్టిమేట్ లు రూపొందించి ఆ వివరాలను సంబంధిత యాజమాన్యాలకు మెయిల్ రూపంలో అందజేయబడతాయన్నారు. ఈ విధానంతో ప్రక్రియ ఎంతో పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయబడి ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు సౌకర్యంగా ఉంటుందని వెల్లడించారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు జరుపుకుందాం : ఎమ్మెల్యే తలసాని

- 268దేవాలయాలకు కోటి 62లక్షల రూపాయల చెక్కులు పంపిణీ

**బేగంపేట జూలై 5, ప్రభాతవార్త :** మన సంస్కృతి, సంప్రదాయాలను మరింత పెంపొందించే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని 268దేవాలయాలకు బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం కోటి 62లక్షల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, కార్పోరేటర్లు, అధికారులతో కల్సి అందజేసారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తెలంగాణా సంస్కృతి ,సాంప్రదాయాలను చాటిచెప్పే బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో డిమాండ్ చేసినా అమలుకు నోచుకోలేదని చెప్పారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేసారు. బోనాలను వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకే కాకుండా ప్రయివేటు ఆలయాలకు కూడా ఆర్ధిక సహాయం అందించినట్లు వివరించారు. అదే పరంపరను కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం దేవాలయాలకు ఆర్ధిక సహాయం అందిస్తుండటం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధన్యవాదాలు తెలియజేసారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్ధిక సహాయాన్ని ఆలయాల అలంకరణ, బోనాల ఉత్సవాల కోసం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 13వ తేదీన జరిగే మహాకాళీ జాతర, 14న నిర్వహించే రంగం, అంబారీపై అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలు జరిగేలా అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కుర్మ హేమలత, టి. మహేశ్వరి, కొంతం దీపిక, సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్, దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాస్‌శర్మ, శ్రీదేవి, కామేష్, వివిధ దేవాలయాల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



దేవాలయాలకు బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని, డిప్యూటీ మేయర్ శ్రీలత.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మెహిదీపట్నం, జూలై 5, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ లోని శారద నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాభివృద్ధే తమ లక్ష్యమని అందులో భాగంగా వాడవాడలా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడంతో పాటు పేద బడుగు, బలహీనవర్గాల ప్రజా సంక్షేమానికి తగు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా అమలు చేస్తూ అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ బండారి రాధిక, నాయకులు అనిల్, గంగాధర్, ఉమారాణి, భుజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**జిమ్ అభివృద్ధి కోసం కేంద్రమంత్రికి వినతి**

తాళ్లగడ్డలోని రాజ లింగయ్య కబడ్డీ స్టేడియంలోని జిమ్ లో వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం అందించారు కార్వాన్ బిజెపి సీనియర్ నాయకుడు గురజాల శివరాజ్ యాదవ్. ఈ సందర్భంగా కు పరికరాలు అందిస్తే యువకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.




శారదా నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.

## చార్మినార్ భాగ్యలక్ష్మీ మందిరంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు పూజలు



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు

**చార్మినార్, జూలై 5 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు శనివారం హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు. భాగ్యలక్ష్మీ అమ్మ వారికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సస్య శ్యామలంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని, తెలంగాణలో బిజెపి బలం పెరగాలని కోరుతూ చార్మినార్‌శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి పూజలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రజలు బిజెపి వెంట ఉన్నారని, తప్పకుండ బిజెపి తెలంగాణ ప్రజలకు న్యాయం చేస్తుందని ఆయన తెలియజేశారు. అందుకు కావలసిన శక్తిని ఇవ్వాలని కోరుతూ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారిని ప్రార్ధించామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ బండారు కార్తీక్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రేమ్ చందర్ రెడ్డి, బిజెపి కార్పొరేటర్లు దర్శన్, శంకర్ యాదవ్, పాతబస్తీకి చెందిన బిజెపి నాయకులు పాశం సురేందర్, ఎం.కుమార్, టి. ఉమా మహేంద్ర, ఠాకూర్ రంజిత్ సింగ్, చేతన్ సూరితో పాటు అధిక సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనన్య సాధ్యం నవరసభరిత కూచిపూడి రంగప్రవేశం

**రవీంద్రభారతి, జూలై 5 ప్రభాతవార్త :** శ్రీవెంటేశ్వర కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురువు కుబేరిని శిష్యురాలు, పి.అవినాష్, నీత తనయ పి.అనన్య భారతీయ శాస్త్రీయ నృత్యం కూచిపూడిపై మక్కువతో తన 8వయేటనే శిక్షణ ప్రారంభించి సంపూర్ణ పరిణతితో కూచిపూడి రంగప్రవేశం నవరసభరితం అనితరసాధ్యంగా కావించి ఆహుతులను మైమరపించింది. అనన్య తన కూచిపూడి రంగప్రవేశాన్ని నాటరాగం ఆదితాళంలో శ్రీగణపతి తాళంలో ప్రారంభించి రుక్మిణి ప్రవేశ దరువు, కొలువై ఉన్నాడే దేవదేవుడు, దుర్గా తరంగం, స్వాగతం కృష్ణా, ధనుశ్రీ తిల్లానా చివరిగా మంగళం అంశంతో అద్భుత హావభావాలను ఎంతో శృతిలయబద్ధంగా ప్రదర్శించి వీక్షకులను తన్మయుల్నిచేసి హర్షధ్వానాల మధ్య ప్రశంసలందుకుంది. గురువు కుబేరిని, డా. ఆర్. శ్రీకాంత్‌లు నట్టువాంగం; డి.మృధురవళి గాత్రం; వి.శ్రీధరాచార్య మృదంగం; ఉమా వెంకటేశ్వర్లు వేణువు; కె.చందర్‌రావు వయోలిన్‌తో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి, కొరియోగ్రఫర్, సినీనటి బి.సంధ్యరాజు కళాకారిణి అనన్యకు శుభాశీస్సులు, నాట్యగురువు కుబేరినికి శుభాభినందనలు తెలియజేశారు.



నన్య కూచిపూడి రంగప్రవేశ దృశ్యం

## నవలలు కథలు వ్యక్తిత్వ వికాసం కలిగిస్తాయి


-తెలంగాణ సాహిత్యఅకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి




ఆచార్య కొలకలూరి ఇనాక్ రంధి నవల అవలోకన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్యఅకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** నవలలు కథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని, అందుకే ప్రతి వారూ గ్రంథ పఠనం చేయాలని ప్రముఖ సాహితీ వేత్త, తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ఇనాక్ రాసిన 'రంధి' నవల ఆత్మ విశ్వాసానికి ప్రతీక అన్నారు. శనివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళావేదికపై పై గాన సభ నిర్వహణ లో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం లో భాగంగా సినిమా రచయిత డాక్టర్ రవీంద్ర బాబు రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ రంధి నవల అవలోకన గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న నందిని సిద్ద రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు ఇనాక్ రచనలు అన్నిటిలో మనుషులు మద్య ప్రేమ తత్వం ఆత్మ విశ్వాసం ధిక్కారం అంశాలు గా ఉంటాయని వివ రించారు రంధి నవల్లో కథా నాయకి తిరుగుబాటు పోరాటం నేటి తరం వారికి స్ఫూర్తి ఇస్తుందని తెలిపారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణ, సాహితీ పరిశోధకురాలు సుధా రాణి పాల్గొన్నారు. అనంతరం నాట్య గురువు మల్లాది భావన శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాలు ప్రదర్శించారు.

## గోపూజతో విఠలేశ్వర పూజలు ప్రారంభం



విఠలేశ్వర స్వామి ఆలయంలో గోపూజతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆలయకమిటి నిర్వాహకులు కిషన్‌యాదవ్, పి.మాణిక్‌రావు తదితరులు

**బేగంబజార్, జూలై 5 ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే ఆలయంగా జంగల్ విఠోభా స్వామి(పాండురంగస్వామి) ఉస్మాన్‌షాహి విఠల్‌నగర్‌లో ఉన్న చారిత్రాత్మకమైన ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ పూజలు చేస్తే కోరికలు ఫలిస్తాయని భక్తులకు అత్యంత విశ్వాసం ఉన్నందున ఈ ఆలయానికి భక్తులు నిత్యం పెద్ద ఎత్తున్న తరలి వస్తుంటారు. ఈ ఆలయం ఎదురుగానే హన్‌మాన్ మందిరం ఉంది. ఇక్కడ ప్రతి యేటా ఆషాడ మాసంలో ఏకాదశి పూజలతోపాటు రథోత్సవంతోపాటు పాండు రంగ స్వామి వారి బ్రహ్మోత్సవములు పది రోజుల పాటు అంగ రంగ వైభవంగా నిర్వహిస్తారు. జంగల్ విఠోభా దేవాలయానికి ఎంతో చరిత్ర ఉంది. శనివారం జంగల్‌విఠోభా దేవాలయంలో సంప్రదాయ ప్రకారం గోపూజ చేసిఉత్సవాలను విఠలేశ్వర బాల భక్త సమాజం చైర్మన్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్, అధ్యక్షులు వి.కిషన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.మాణిక్‌రావు, గోల్కొండ జిల్లా మాజీ బిజెపి అధ్యక్షులు వి.పాండుయాదవ్, ఉపాధ్యక్షులు గోవింద్ మహారాజ్ పలువురు కమిటి ప్రతినిధులు పాల్గొన్ని ఉత్సవాలను ప్రారంభించారు. 6వతేది తెల్లవారు జామున మహాభిషేకం, పూజహారతి, మహానైవైద్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. 6వ తేదిన తెల్లవారు జామున బ్రహ్మముహుర్తమున మహాభిషేకం, పూజ, హారతి పూజలు కొనసాగుతాయన్నారు. దేవాలయం నుంచి శేషవాహనంపై శ్రీస్వామి వారిని ఆసీనముగా గావించి రథంపై విఠలేశ్వర రుక్మాబాయి రథోత్సవ ఊరేగింపు పురవీధుల్లో కొనసాగుతుందన్నారు. పాండురంగ, రుక్మాబాయి ఊరేగింపు దేవాలయం వరకు ఉంటుందన్నారు. రథోత్సవానికి వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు విచ్చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విఠలేశ్వర స్వామి ఆలయ ప్రతినిధులు బోయిని వెంకటేష్ యాదవ్, ఆర్.నరేందర్, ధన్‌రాజ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, గోపియాదవ్, సాయింాంయాదవ్, గలిబేవిశాల్ కట్టరమేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి ఇంటిమెట్లు కూలి ..మహిళకు గాయాలు

-లాలాపేట్ చంద్రబాబునాయుడు నగర్‌లో ఘటన



కూలిన మెట్లు

**తార్నాక, జూలై 5 ప్రభాతవార్త:** వర్షం కారణంగా ఇంటి మెట్లు కూలి మహిళకు గాయాలైన ఘటన లాలాపేట్‌లో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి లాలాపేట చంద్రబాబునాయుడు నగర్ బస్తి లో పేదలు ఉండే జెఎన్ ఎన్ యు ఆర్ ఎం ఇండ్ల సముదాయంలోని ఓఇంటికి మెట్లు కూలిపోయాయి. ఈ ఘటనలో ముజాంబి అనే ఓమహిళకు గాయాలయ్యాయి. దీంతో బస్తివాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మెట్లు కూలడంతో స్థానికులు తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు.

## ప్రియుడితో మాట్లాడొద్దని చెప్పినందుకు భర్తను హత్య చేసిన భార్య

-గాల్లో కలిసిన మరో భర్త ప్రాణం

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త :** సర్వేయర్ తేజేశ్వర్ ఘటన మరువక ముందే హైదరాబాద్ సిటీలో భర్తను భార్య చంపిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాచుపల్లిలో అంజిలప్ప అనే వ్యక్తిని అతని భార్య రాధ హత్య చేసింది. అంజిలప్ప కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు రాధపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. రాధ తన భర్తను హత్య చేసి సడెన్ డెత్గా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. భార్యాభర్త సిటీలోని ఒక కాంట్రాక్టర్ దగ్గర కూలీలుగా పని చేస్తున్నారు. రాధ ప్రియుడి విషయంలో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. తాగి పడిపోయిన భర్త గుండెల మీద దాడి చేసి గొంతు నులిమి భార్య రాధ హత్య చేసింది. ఎవరికి అనుమానం రాకుండా తాగి చనిపోయాడని పక్కన వారిని నమ్మించింది. మృతదేహాన్ని నారాయణ పేటకు తరలించగా అంజిలప్ప గొంతు నులిమినట్లుగా గుర్తులు కనిపించాయి. దీంతో.. అంజిలప్ప కుటుంబ సభ్యులకు రాధపై అనుమానం వచ్చింది. గొంతు దగ్గర గాయాలు ఉండటంతో పోలీసులకు అంజిలప్ప కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఘటన బాచుపల్లిలో జరగడంతో నారాయణ్ పేట్ పోలీసులు ఈ కేసును బాచుపల్లికి బదిలీ చేశారు. బాచుపల్లి పోలీసులు రాధను విచారించగా తానే భర్తను చంపేసినట్లు రాధ ఒప్పుకుంది. దీంతో.. దర్యాప్తు అనంతరం రాధను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. రాధ, అంజిలప్పకు పెళ్లై పదేళ్లయింది. బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం హైదరాబాద్ సిటీకి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. ధన్వాడ మండలం రాంకిష్టయ్యపల్లికి చెందిన రాధకు ధన్వాడలో ఒక యువకుడితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం అంజిలప్పకు తెలిసి ఇలాంటి పని చేయొద్దని భార్యను మందలించాడు. జూన్ 23న మద్యం మతులో ఉన్న అంజిలపును రాధా గొంతు మలిమి హత్య చేసింది మధ్యానికి బానిసై తాగి చనిపోయాడని నమ్మించాలని రాధ భావించినప్పటికీ అంజిలప్ప గొంతు మీద ఉన్న గుర్తుల కారణంగా రాధ ప్లాన్ బెడిసి కొట్టింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టంలో కొంతుపై ఒత్తిడి వల్ల మరిణించినట్లు తెలింది. దీంతో భార్యను అనుమానించిన పోలీసులు తమదైన స్టైల్‌లో విచారించారు. భర్తను తనే చపినట్లు భార్య రాధ ఒప్పుకోంది. ప్రియుడితో మాట్లాడొద్దని, మదలించడం వల్లేనే చంపనని చెప్పింది. ఆమెను బచుపల్లి పోలీసులు రిమాండ్ తరలించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**- మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వీరేందర్‌రెడ్డి

**నిజాంపేట్, జూలై, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతం కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి అన్నారు. శనివారం 18వ డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా చేపట్టే పలు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు తుచా తప్పకుండా పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రంజీత్, విజయ్, పాల్గొన్నారు.

## దేశసేవపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ఆర్మీ అధికారుల నుండి సి సర్టిఫికెట్ అందుకున్న ఇంగ్లీష్ యూనియన్ ఎన్‌సీసీ విద్యార్థులు

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** దేశ సేవ గురించి విద్యార్థులకు చిన్నతనం నుండే అవగాహన కల్పించాలని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ లోని ఎన్‌సీసీ విద్యార్థులకు ఆర్మీ అధికారులు సి సర్టిఫికెట్‌లు అందచేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ కాడెట్స్ ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆర్మీ అధికారుల చేతుల మీదగా సి సర్టిఫికెట్లు అందచేయటమే కాకుండా విద్యార్థులకు డిఫెన్స్ సర్వీస్‌ల పై అవగాహన కల్పించటం జరిగిందని తెలిపారు.

## దాతల సహకారంతో పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, జూలై, ప్రభాతవార్త**

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో దాతల సహకారంతో పేద విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ గా చేస్తున్న జి. లక్ష్మి తను పుట్టినరోజు సందర్భంగా విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జగదిరిగుట్టకు చెందిన శేఖర్ అనారోగ్య కారణంగా చనిపోవడంతో ఆ కుటుంబ పెద్దను కోల్పోయింది. రాధా హాస్పిటల్లో సెక్యూరిటీగా పనిచేస్తూ ఇద్దరూ కుమార్తెలను చదివిస్తుంది. తుడి లిఖిత ఎం.ఎల్.ఆర్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ (డేటా సైన్స్) విభాగంలో మొదటి సంవత్సరం చదువుతుంది. సంవత్సరానికి 2 లక్షల ఖర్చు అవుతుంది వాళ్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మాకు వివరించడంతో మేము స్పందించి దాతలు సహకారంతో విద్యార్థినికి రూ. 5000 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. దాత జి. లక్ష్మి గత 15 సంవత్సరాలుగా తన పుట్టినరోజు సందర్భంగా ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక సహాయంతో, స్టడీ మెటీరియల్ తో పాటు అనాధాశ్రమాలకు చేయూతను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సోమ నరసమ్మలు పాల్గొన్నారు

## ప్రత్యేక రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర కీలకం

**-తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం**



ప్రసంగిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కళాకారుల కోసం ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కళాకారులు ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్రస్ట కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక సమావేశం వేముల యాదగిరి, కాంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలకు సంబంధించి జిల్లాల కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. వరంగల్, సిద్దిపేట, గజ్వేల్, నాగర్‌కర్నూలు, మెదక్, సంగారెడ్డి, భువనగిరి, రంగారెడ్డి జిల్లా కన్వీనర్, కోన్వీనర్‌లుగా కొయ్యడ రాజేష్, స్వరూప రాణి, బాల్‌లక్ష్మయ్య, యాదగిరి, చంద్రకళ, కాంపల్లి సాయిలు, మాడుగల వెంకటయ్య, కొండలు, యాదగిరి, రేణుక, సుగుణమ్మ, లావణ్య, ఇందిరలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టియుజేఏసీ కోశాధికారి చంద్రన ప్రసాద్, తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల బద్రి, మహిళావేదిక ప్రధాన కార్యదర్శి లావణ్య యాబై మంది ఉద్యమకారులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట గౌడ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గిరిధర్‌గౌడ్, తొలుపునూరి కృష్ణగౌడ్

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త**

అంబర్‌పేట గౌడ సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం చైర్మన్‌గా బత్తిని రవీందర్‌గౌడ్, అధ్యక్షుడుగా పంజాల గిరిధర్‌గౌడ్, సంఘం ప్రధాన కార్యదర్శిగా తొలుపునూరి కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా నాధిపల్లి శ్రీహరిగౌడ్, బండి మల్లికార్జున్ గౌడ్, రుద్రగౌని శ్రీధర్‌గౌడ్, మలక్‌పేట్ సతీష్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా పంజాల మహేష్‌గౌడ్, పంజాల వెంకటేష్‌గౌడ్, కోశాధికారిగా చెరుకు రమణగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రంగ ప్రదీప్‌గౌడ్, మరేడుపల్లి రోహిత్‌రాజ్‌గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా కె.దశరథ్‌గౌడ్, జి.రాజేందర్‌గౌడ్, కె. అంజన్‌దాస్ గౌడ్, బి.సురేందర్‌గౌడ్, జె.ఓంకార్‌గౌడ్‌లు వ్యవహ రించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి తొలుపు నూరి కృష్ణగౌడ్ మాట్లాడుతూ అంబర్‌పేట గౌడ సంఘాన్ని రాజకీ యాలకు అతీతంగా, అందర్ని కలుపుకొని ముందుకు తీసుకెళ్లుతామని పేర్కొన్నారు.

# మణికొండలో జోరుగా సెల్లార్ల తవ్వకాలు

- అధికారులకు కాసులు కురిపిస్తున్న సెల్లార్లు
- వర్షాకాలంలో సెల్లార్లు తవ్వకూడదన్న నిబంధనలకు తూట్లు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారగణం
- సెల్లార్లు తవ్వితే ఇంటి అనుమతులు రద్దు చేస్తాం : కమిషనర్



మణికొండ మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న సెల్లార్ల తవ్వకాల దృశ్యాలు.

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా సెల్లార్ల తవ్వకాలు సాగుతున్నాయి. వర్షాకాలంలో సెల్లార్లు తవ్వకూడదని ప్రత్యేకంగా ఓ జీవో ఉన్నా దాన్ని నిర్మాణ దారులు లెక్క చేయడం లేదు. సెల్లార్ల తవ్వకాలను అడ్డుకునే అధికారం ఉన్న అధికారులు కాసులకు కక్కుర్తి పడి చూసీ, చూడనట్లు నటిస్తున్నారు. అధికారులకు అడిగినంతా ముట్టజెప్పుతున్నాం ఇక మనలను అడేగే వారు లేరంటూ నిర్మాణం దారులు రెచ్చిపోతున్నారు. 20.కిపైగానే మణికొండలో సెల్లార్లు తవ్వుతున్నారు. అధికారుల పాలనలో జవాబుదారి తనం లోపించిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల పదవులు ముగియడంతో వారు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు అధికారులు ఏమనుకుంటే అదే చట్టం అన్న చందంగా మారిపోయింది. సిరులు కురిపిస్తున్న సెల్లార్లను మున్సిపల్ కమీషనర్‌గాని, టౌన్‌ప్లానింగ్ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. పలుమార్లు స్థానికులు ఈ సెల్లార్ల వలన కూలీల ప్రాణాలు పోయే ప్రమాదముందని, అడ్డుకోండని సూచించినా అధికారులలో చలనమే లేదు. చూస్తాము, చేస్తాము, నోటీసులు ఇస్తాము అంటూ కాలయాపన చేస్తున్నారు. అధికారుల పరోక్ష మద్దతుతో భవన నిర్మాణందారులు నిబందనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా సెల్లార్లను తవ్వేస్తున్నారు. మణికొండలోని పంచవటి కాలనీ, అల్కాపూర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీలలో జోరుగాసెల్లార్ల తవ్వకం సాగుతుంది.

**కూలీల ప్రాణాలకన్నా కాసులకే ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు**

వర్షాకాలంలో తవ్వే సెల్లార్ల వలన మట్టిదిబ్బలు మీద పడి తరుచూ వసల కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారు. కూలీల ప్రాణాలు కాపాడేందుకే ప్రభుత్వాలు వర్షాకాలంలో మూడు నెలల పాటు సెల్లార్లు తవ్వకూడదని ప్రత్యేకంగా ఓ జీవో తీసుకు వచ్చి, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు ఈ నిబందనలు తప్పకుండా పాటించాలని ఆదేశాలు జారీ చేశాయి. ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిన మున్సిపల్ కమీషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కూలీల ప్రాణాలకన్నా కాసులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. మణికొండలో పెద్ద ఎత్తున సాగుతున్న సెల్లార్ల తవ్వకం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తుంది. కొన్ని సెల్లార్లలో మూడు ఫీట్ల మేర వర్షపు నీరు నిలిచిపోయింది. చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి ఆ నీటిలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. 150.గజాల నుంచి వెయ్యి గజాల వరకున్న ప్లాట్లన్నింటిలో సెల్లార్లు తవ్వేస్తున్నారు. సెల్లార్ల కోసం అనుమతులు ఇవ్వకున్నా భవన నిర్మాణందారులు యధేచ్ఛగా సెల్లార్లు తవ్వుతున్నారు. నిత్యం ఏరియాల్లో తిరిగే మున్సిపల్ జవాన్లకు ఈ విషయం తెలిసినా, టౌన్‌ప్లానింగ్ అధికారికి, కమీషనర్‌కు తెలిసినా స్పందిచకపోవడం వారి అలసత్వంకు, పరోక్ష మద్దతుకు నిదర్శనం.

**ఐదారుగు మరణించినా అలసత్వం వీడరా?**

ఇదే మణికొండలో గతంలో సెల్లార్లు తవ్వుతుండగానే పెద్ద ఎత్తున మట్టికుప్పలు కూలి పైన పడడంతో ఐదారుగురు దుర్మరణం చెందారు. 25. జూన్ 2022న మణికొండలోని ఇఐపిల్ వద్ద సెల్లార్లు తవ్వుతుండగా శ్రీకాకుళం నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన ప్రసాద్, వెంకటరమణలు మట్టిపెల్లలు పైన పడి సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ఇదే మణికొండలో మరో రెండు సంఘటనలలో ముగ్గురు కన్నుమూశారు. తరుచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా, పొట్ట చేతపట్టుకొని వచ్చిన వసల కూలీలు సమిధలవుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులలో కదలిక రాకపోవడం విచారకరం. కూలీలు మట్టి దిబ్బల కింద సమిధలవ్వకుండా ఉండాలంటే. ఇప్పటికైనా మున్సిపల్ శాఖకు చెందిన పైస్థాయి అధికారులు స్పందించి మణికొండలో యధేచ్ఛగా సాగుతున్న సెల్లార్ల తవ్వకం పర్వానికి తెర వేయాల్సిన అవసరం ఉంది.

### కమిషనర్ వివరణ :

మణికొండలో జోరుగా సాగుతున్న సెల్లార్ల తవ్వకాలపై కమీషనర్ ప్రదీప్ కుమార్‌ను ప్రభాతవార్త వివరణ అడిగితే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. 20.వరకు సెల్లార్లు తవ్వుతున్న యజమానులకు నోటీసులు ఇచ్చామని, వెంటనే పనులు ఆపకపోతే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మూడు నెలలు ఎవరు సెల్లార్లు తవ్వినా ఉక్కుపాదం మోపుతామని కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు.

## విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : వంశీకృష్ణ రెడ్డి

**జీడిమెట్ల, జూలై, ప్రభాతవార్త**

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ పట్టుదల జిజ్ఞాస వంటి అలవాట్లను అలవర్చుకొని గొప్ప విద్యార్థులుగా రాణించాలని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ వంశీకృష్ణ రెడ్డి అన్నారు. శనివారం టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్వెస్టిట్యూర్ సిరెమోనీ (క్రమశిక్షణ మండలి) ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం జయరాజ్ ఆధ్వర్యంలో స్కూల్ క్యాబినెట్ స్టూడెంట్స్ కి ఎలక్షన్ నిర్వహించి ఓటింగ్ ద్వారా స్టూడెంట్స్‌ని ఎన్నుకున్నారు. హెడ్ బాయ్ గోవింద నందన్ హెడ్ గర్ల్ తనుశ్రీ, సీసీఏ, వైష్ణవి, సంచిత్ వాంకడే, స్పోర్ట్స్ కెప్టెన్ రష్మీ దశ, జితేందర్ వర్మ లను స్టూడెంట్ క్యాబినెట్ లీడర్స్‌గా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ టి కోల్ పియుష్ షా (లెఫ్టినెంట్ కల్నల్ పీయూష్ షా) పాల్గొని వారి చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు బ్యాడ్జెస్, స్లాషేస్ అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులను సిద్ధహస్తులుగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను అభి నందించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటి రెడ్డి, అకా డమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ప్రేమిస్తున్నానని మోసం చేసిన ఆటోడ్రైవర్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** ప్రేమిస్తున్నాని యువతి వెంటపడి శారీరకంగా దగ్గరై గర్భవతిని చేసి మొహం చాటేశాడు ఓ వివాహితుడు. దీంతో మోసపోయానని మానసిక క్షోభను అనుభవించి చివరకు తనువుచాలించింది. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు వివరాల ప్రకారం నాచారానికి చెందిన మహేందర్ ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో సమీపంలోని ఉండే ఓ యువతి కోచింగ్‌కు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో పరిచయం ఏర్పడి కాస్తా ప్రేమగా మారింది. అయితే అప్పటికే సదరు ఆటోడ్రైవర్‌కు వివాహమై పిల్లలున్నారు. యువతికి పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబర్చుకుని శారీరకంగా దగ్గరై కోరికను తీర్చుకున్నాడు. దీంతో యువతి గర్భందాల్చడంతో ఫోన్‌లో అతన్ని పెళ్లి గురించి అడగగా నిరాకరించడంతో కుటుంబసభ్యులకు వివరించింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సదరు యువతి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడంతో సదరు ఆటోడ్రైవర్‌పై పలు కేసులు వెలుగుచూశాయి. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## మణికొండలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట :ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మణికొండలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మణికొండలోని వివిధ కాలనీలో రూ.7.కోట్ల 77.లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలను కమీషనర్ ప్రదీప్ కుమార్, మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, మాజీ వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నగరానికి ఆనుకొని ఉన్న మణికొండను రాజధానికి ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేగంగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అంతే వేగంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు వ్యాపించకుండా పారిశుద్య విభాగం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. మురుగు నీరు, చెత్త నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వరదల సమయంలో మ్యాన్‌హోళ్లు తెరిస్తే అవి మూసే వరకు కార్మికులు అక్కడే విదులు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శనివారం రూ.42.లక్షలతో శివనగర్ కమ్యూనిటీహాల్, రూ.కోటితో అల్కాపూర్‌లోని పార్కు-1.ను అభివృద్ధి చేయించారు. అలాగే రూ.75.లక్షలతో స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద బాక్స్ కల్వర్ట్ పనులను ప్రారంభించారు. రూ.50.లక్షలతో వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్డుకు శంఖుస్థాపన, అలిజాపూర్‌లో రూ.50.లక్షలతో సెంట్రల్ మీడియన్‌కు శంఖుస్థాపన, రూ.కోటి 25.లక్షలతో నిర్మించిన శివాజీ నగర్ కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవం, రూ.2.కోట్ల 75.లక్షలతో నిర్మించిన జల మండలి, ఎస్‌బి కార్యాలయం కమ్యూనిటీహాల్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు యాలాల నరేష్, పద్మారావ్, సాయిరెడ్డి, శ్రీరాములు, బషీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ అంటూ..నగరంలో రూ.53లక్షలు లూటీ..

**అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్దుడికి సైబర్ నేరగాళ్ల వల..**

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త :** నగరంలో సైబర్ నేరగాళ్లు మరోసారి విజృంభించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సరికొత్త మోసానికి పాల్పడి, అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. 53 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.గత నెల 18న బాధితుడికి ఒక గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఢిల్లీ డీసీపీ రాజీవ్ కుమార్‌ను అని పరిచయం చేసుకున్నాడు. బాధితుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయిందని నమ్మబలికాడు. వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని బెదిరించాడు. తన మాటలను బాధితుడు నమ్మేలా చేయడానికి, బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఒక నకిలీ ఆర్డర్ కాపీని వీడియో కాల్‌లో చూపించాడు.దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వృద్ధుడు, తనపై కేసు నమోదు చేయవద్దని వారిని వేడుకున్నాడు. ఇదే అదనుగా భావించిన నేరగాళ్లు, కేసు నుంచి బయటపడాలంటే తమకు సహకరించాలని సూచించారు. ఖాతాలోని డబ్బును తాము చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేస్తే వాటిని పరిశీలించి తిరిగి జమ చేస్తామని మాయ మాటలు చెప్పారు.వారి మాటలు నమ్మిన బాధితుడు విడతల వారీగా రూ. 53 లక్షలను వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. డబ్బులు అందిన వెంటనే సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ కట్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఎంత ప్రయత్నించినా వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**మరోకేసులో..క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వృద్ధుడికి టోకరా..**

క్రెడిట్ కారునడ లిమిట్ పెంచుతామంటూ నగరంలోని షేక్‌పేటకు చెందిన 67 ఏళ్ల వృద్దుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామంటూ వృద్ధుడికి వీడియో కాల్ చేశారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని లింక్ పంపారు. కాల్‌లో ఉండగానే వివరాలు ఎంటర్ చేయాలని సైబర్ నేరగాళ్లు వృద్ధిడికి చెప్పారు. వివరాలు ఎంటర్ చేయగానే లిమిట్ 2.5లక్షలకు పెరిగిందని..24 గంటల్లో అప్‌డేట్ అవుతుందని చెప్పి ఫోన్ కట్ చేశారు. వెంటనే రూ.2.03 లక్షలు ఖాతా నుంచి డెబిట్ అవ్వడంతో వృద్దుడు ఆందోళనకు గురయ్యాడు. మోసపోయానని గ్రహించి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ డబ్బులు తీసుకొని మోసగించిన డాక్యుమెంట్ రైటర్

**-కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాప్ శాఖకు బాధితుడు బత్తుల బెనర్జీ వినతి**

**గోషామహల్, జూలై 5ప్రభాతవార్త:** తన ప్లాట్ సంబంధించి రిజిస్ట్రేషన్ చేయడానికి చిక్కడ పల్లి సబ్ రిజిస్ట్రేషన్ వద్ద సిరి అసోసియేట్ డాక్యుమెంట్ రైటర్ పుట్ట హరిబాబు నకిలీ రశీద్‌ను సృష్టించి తననుమోసగించారు. రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ తన వద్ద నుంచి ఐదులక్షల రూపాయలపైగా తీసుకుని ఫోర్జరీరశీద్ ఇచ్చిన అతనిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి బత్తుల బెనర్జీ కోరారు. ఈమేరకు రాష్ట్ర కమీషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్, అండ్ స్టాంప్‌శాఖ ఆర్‌జీ హనుమంతుని కలిసి బెనర్జీ వినతిప్రతం ఇచ్చారు. గగన్‌మహల్ దోమల్‌గూడ నివాసి అతని వద్దకు వెళ్లగా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తానని, నమ్మబలికించి తన వద్ద నుంచి 5లక్షల 24,300 లక్షలుతీసుకున్నాడు. తర్వాత నకిలీ రశీద్ ఇచ్చాడు. వెంటనే తానుచాలన్ రశీద్ తీసుకుని నెంబర్ 199 కెడిడబ్ల్యు010624 తీసుకుని చిక్కడపల్లిలని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వెళ్లి, రశీద్‌ను చూపించగా అది అసలు రశీదుకాదు, ఫోర్జరీ నకిలీ చేసిన చాలన్ అని తేల్చారు. దీంతో అక్రమార్కుడి చేతిలో మోసపోయానని నిర్ధారించుకుని తాను ఒకసారిగా దిగ్భ్రాంతికి గురయ్యానని వెళ్లి హరిబాబును నిలదీయగా సారి టెక్నికల్ తప్పు జరిగిందని భావించి వాపస్ చేయాలని వత్తిడి పెంచాడు. హరిబాబు డబ్బులు ఇవ్వకుండా 742946 నెంబర్ చెక్కు ఇచ్చాడు. దీన్ని తీసుకుని బ్యాంకు వెళ్లి బ్యాంకులో వేయగా చెక్కుబౌన్స్ అయ్యిందన్నారు. ఇలా ఎంతమందిన్ని హరిబాబు మోసం చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని నగర పోలీసు కమీషనర్, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందచేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

## నిరాశ్రయులైన వారిని ఆదుకోవడం మంచి సంప్రదాయం

**-అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సల్మాన్ రాజ్**

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** అణగారిన నిరాశ్రయులైన అనాథలకు ఆహారం పెట్టండి పేరుతో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే" సందర్భంగా నిరాశ్రయులైన పేదలకు ఉచిత అల్పాహారం పంపిణీ చేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సామ్యూల్ కరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సల్మాన్ రాజ్ హాజరై పంపిణీ చేసారు. ఒక మంచి ఆశయంతో పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు.

## అర్హులైన వృద్ధ కళాకారులకు ఫింఛన్లు

**-రాష్ట్ర సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ

**రవీంద్రభారతి, జూలై 5 ప్రభాతవార్త :** భారతీయ, తెలంగాణ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు, కళలకు కళారూపాలతో జీవంపోసి కాపాడుతూ భావితరాలకు అందిస్తున్న వృద్ధ కళాకారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని, అలాగే కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సంపూర్ణకృషి చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ నేతృత్వంలో పలువురు కళాకారులు మంత్రిని కలిసి అర్హులైన వృద్ధకళాకారులకు పింఛన్ మంజూరు, ఆరోగ్యభీమా సదుపాయం కల్పించాలని, హెల్త్‌కార్డులు అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లి అర్హులైన వృద్ధకళాకారులందరికీ పింఛన్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర ఎన్నటికీ మరచిపోమని, వారికి ప్రజాప్రభుత్వం అండదండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** డెమో రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేసీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం విద్యానగర్, కాచిగూడ రైల్వేస్టేషన్ మార్గంలో శనివారం పట్టాలపై యువకుడు (25) మృత్యువాత పడినట్లు స్థానిక ప్రయాణికులు గమనించారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనస్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తెలుపురంగు చొక్కా, నీలిరంగు జీన్స్ ధరించాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సున్నంచెరువులో ప్రమాదకరంగా చిన్నారుల ఈత



సున్నం చెరువులో ప్రమాదకరంగా ఉన్న ఈత కొడుతున్న చిన్నారులు

**యూసుఫ్‌గూడ, జూలై 5, ప్రభాతవార్త :** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా యంత్రాల ద్వారా సుందరీకరణ పనులను చేపడుతున్నారు. చెరువు పరిసరాలలో హైడ్రా పనులు జరుగుతున్నప్పటికి అక్కడి చిన్నారులు చెరువులో దిగి ప్రమాదకరంగా ఈత కొడుతున్నారు. చెరువులో పనిచేస్తున్న యంత్రాల వల్ల ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు అయినా చిన్నారులు నిర్లక్ష్యంగా ఈత కొడుతూ కనిపిస్తున్నారు. ఒకవేళ ప్రమాదం జరిగితే దీనికి బాధ్యత ఎవరిది అనే ప్రశ్న స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్కడ సెక్యూరిటీ ఉండి కూడా ఈతను అడ్డుకోవడంలో విఫలం అవుతున్నారు. ప్రమాదం జరగకముందే ఈ విషయంపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని చెరువు వద్ద సరియైన భద్రత ఏర్పాట్లు పెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 'మహాటీవీ' దాడి ఘటనలో జూబ్లీహిల్స్‌పోలీసులకు షోకాజ్ నోటీసు

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** మహాటీవీ న్యూస్ ఛానెల్ దాడి ఘటనలో నిందితుడిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జూబ్లీహిల్స్ పోలీసులకు శనివారం కోర్టు షోకాజ్ నోటీస్ జారీ చేసింది. దాడికి పాల్పడిన కేసులు అరెస్ట్ అయిన నిందితుడు కొల్లిసాయి నాగేశ్వర్‌రావుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్యపదజాలంతో దూషించి చిత్రహింసలకు గురిచేశారని బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ న్యాయవాది జక్కుల లక్ష్మణ్ కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జూబ్లీహిల్స్ విచారాణాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే ఈ పోలీస్‌స్టేషన్‌లో ఇన్విస్టిగేషన్ అధికారికి కోర్టు నోటీసులు ఇవ్వడం రెండోసారి కావడం చర్చానీయాంశంగా మారింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**పేట్ బషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...దుండిగల్ ప్రాంతానికి చెందిన జమలాపూర్ మనోహర్ (22) సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ట్రైనింగ్ నిమిత్తం ఉదయం దూలపల్లి నుండి కొంపల్లి రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో అశోక్ లేలాండ్ సర్వీస్ సెంటర్ ఎదురుగా ప్రైవేట్ బస్సు కొంపల్లి నుండి దూలపల్లి వైపుకు వస్తున్న క్రమంలో పక్కన వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మనోహర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గాడియంలో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

**15 రాష్ట్రాల నుంచి పాల్గొన్న 850 మంది జిమ్నాస్ట్‌లు**



పోటీల్లో జిమ్నాస్ట్‌ల ప్రదర్శన

**హైదరాబాద్, జూలై 5,ప్రభాతవార్త:**

యువతలో క్రీడాస్ఫూర్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు చెందిన ది గాడియం స్కూల్ జిమ్‌క్విన్ రెండో ఎడిషన్‌ను శనివారం ప్రారంభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ ఈవెంట్‌లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి 850 మంది యువ జిమ్నాస్ట్‌లు పాల్గొంటున్నారు. వీరిలో గాడియం స్కూల్ నుంచి 107 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. దేశంలోనే మొదటి సారిగా జిమ్నాస్టిక్స్ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తొలి స్కూల్‌గా ది గాడియం చరిత్ర సృష్టించింది. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ ఈవెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి జిమ్నాస్ట్‌లకు ఇలాంటి జాతీయ వేదికను అందించడం ప్రశంసనీయమన్నారు. ది గాడియం స్కూల్ విద్యతో పాటు దేశ క్రీడా భవిష్యత్తుకు కూడా తోడ్పడుతోంద్ది అని కొనియాడారు. స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కె. కీర్తి రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం పోటీ కాదని, దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదిక అన్నారు. వ్యక్తిగత, టీమ్ పోటీల్లో రిథమిక్ జిమ్నాస్టిక్స్, డ్యాన్స్ జిమ్నాస్టిక్స్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ఫ్లోర్ రొటీన్స్ గ్రూప్ అక్రోబాటిక్స్ వంటి ఈవెంట్లలో జిమ్నాస్ట్‌లు పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి భారత సైన్యానికి చెందిన కల్నల్ కమలేష్ మిశ్రా, పోలీ సు సూపరింటెండెంట్ (ఇంటెలిజెన్స్) శిరీష రాఘవేంద్ర వంటి ప్రముఖులు హాజరై జిమ్నాస్ట్‌లను అభినందించారు.

## నాచారంలో ఘనంగా వనమహోత్సవ వేడుక



పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలో పాల్గన్న చిన్నారులు

**నాచారం, జూలై 5 ప్రభాతవార్త :** పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో చెట్ల పాత్రపై విద్యార్థులకు శనివారం అవగాహన నిర్వహించారు. నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లో జాతీయ వనమహెత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణమంతా ఆకుపచ్చ రంగుతో విలసిల్లింది. పిల్లలు, ఉపాధ్యాయులు ఆకుపచ్చ వస్త్రధారణతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె. నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె. నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నవనీతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మనకు జీవనాధారమనీ, దీనివల్ల మన భవిష్యత్తు పురోభివృద్ధి చెందుతామని అన్నారు. స్వర్ణ అక్కినేని మాట్లాడుతూ మన పర్యావరణం మన ఆరోగ్యానికి మార్గం వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్య, గాన, నాటకాలతో పర్యావరణ పరిరక్షణా సందేశాన్ని అందించారు. విద్యార్థులు పర్యావరణ సంరక్షణ కోసం చెట్లను కాపాడాలని రాఘవేంద నగర్ పరిసరాల్లో ర్యాలీని నిర్వహించారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : సంతోష్ యాదవ్



సికింద్రాబాద్ క్లాక్ టవర్ నగదేవత ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్

**కంటోన్మెంట్,జూలై 5 ప్రభాతవార్త:** ఆకలి మంటలతో అలమటిస్తున్న నిరుపేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. వెస్ట్ మారేడ్‌పల్లి నెహ్రూ నగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం ఎసికింద్రాబాద్ క్లాక్‌టవర్ నాగదేవత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, ప్రతినిధులు రాంచందర్, రవింద్రనాథ్, వైసీ సుంకీ, సుధాకర్, పెంటయ్య, సత్య నారాయణ, మురళీ కటార తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లపై అక్రమ దుకాణాలు చేపడితే సహించేది లేదు : శంకర్ రాజు



సికింద్రాబాద్ కోర్టు వద్ద వెలిసిన అక్రమ కట్టడాలను తొలగిస్తున్న జిహెచ్‌ఎంసి,ట్రాఫిక్ పోలీసులు

**కంటోన్మెంట్,జూలై 5 ప్రభాతవార్త:** ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా రోడ్లపై,ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపార కార్యకలాపాలు చేపడితే ఎంతటివారినైనా సహించేది లేదని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌లు హెచ్చరించారు. సికింద్రాబాద్ కోర్టు, జిహెచ్‌ఎంసి జోనల్ కార్యాలయం ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ దుకాణాలను, టైప్‌రైటింగ్ దుకాణాలు,స్టాంప్ వెండర్ల దుకాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, పావనీ, రాజశ్రీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టి, దానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్ డివిజన్‌లో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భోలక్‌పూర్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌లో చార్మినార్‌ను తలపించే విధంగా వస్త్ర వ్యాపారం కొనసాగుతుందని గుర్తు చేశారు. భోలక్‌పూర్‌లో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు అధ్వాన్నంగా మారడంతో, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు 85లక్షల వ్యయంతో రోడ్లను ఆధునీకరించేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టటం జరిగిందని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజి, వాటర్ పైప్ లైన్ పనులను గతంలో పూర్తి చేశామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రజలను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వ్యాపారులు ఎమ్మెల్యేకు ధన్యవాదములు తెలియచేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిఈ సన్నీ, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రహీం, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు ఉమాకాంత్, చాంద్‌పాషా, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, జునైద్ బాగ్దాది, మున్వర్‌చాంద్, ఆర్.శ్రీనివాస్, మక్బూల్, జబ్బర్, సాయికుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్, గోవింద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శంషుగూడ దర్గాలో ఘనంగా పీర్ల పండగ


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 5, ప్రభాతవార్త**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడాలో ఉన్న దర్గాలో గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీర్ల పండుగ శనివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పీర్ల దేవుళ్ల ప్రతిమలను పూజించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉండే ముస్లింలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం (పీర్ల పండుగ) ఒకటి అని అన్నారు. డివిజన్ ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, ఇమ్రాన్, పద్మారావు, సుబాబా, కళ్యాణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### గుట్ట శంకర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్


శంకర్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 5, ప్రభాతవార్త**
తెలంగాణ ఉద్యమ నేత జగదిరిగుట్ట ప్రాంతానికి చెందిన గుట్ట శంకర్ గుప్తా ఇటీవల గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ చేసుకున్నారు. అయితే విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ శనివారం జగద్గిరిగుట్టలోని గుట్ట శంకర్ నివాసం వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్ ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దుంబాల శ్రీనివాస్ రెడ్డి, వేముల ఆంజనేయులు, శంకర్ గౌడ్, అంజిరెడ్డి, వాసు, జయకృష్ణ, అఖిల్, నర్సింగ్ గౌడ్, రవీంద్ర చారి, సోమయ్య గుప్తా, లక్ష్మణ్, బాలా చారి, సోమేశ్వర్ గుప్తా, చంద్రమోళి, బోర్వెల్ రాము తదితరులు పాల్గొన్నారు.

## జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడం అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

**కంటోన్మెంట్, జూలై 5 ప్రభాతవార్త:**
ప్రపంచ శాంతి, మానవ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడంతో పాటు లోక కళ్యాణార్థం లోక కళ్యాణకారి దివ్య సత్సంగ చాతుర్మాస సమితి ఆధ్వర్యంలో 2025 చతుర్మాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చాతుర్మాస్ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్ జోద్ పూర్ నుండి క్రాంతికారి ఔజస్వి ప్రవచనకారుడు గురు లలిత ప్రభువు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సత్సంగ కార్యక్రమాల కోసం జోద్‌పూర్ నుండి లలిత ప్రభుజి ఆయన శిష్య బృందంతో కాలినడకన పాదయాత్ర చేస్తూ 1600 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నట్లు చాతుర్మాస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ మైదానంలో లోక కళ్యాణకారి దివ్య సత్సంగ ప్రవచనాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జైన సమాజంతోపాటు ఉత్తర భారతీయులంతా పెద్ద ఎత్తున ఈ సత్సంగ కార్యక్రమాలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గురు లలిత ప్రభు మాట్లాడుతూ రెండు నెలల పాటు ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే ప్రవచన సత్సంగంలో ప్రజలకు సందేశం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రవచనాల మూలంగా మానవ జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, సాంస్కృతిక ధార్మిక పరిరక్షణ, నైతిక విలువలు పెంపొందేందుకు దోహదపడతాయని అన్నారు. మానవ జీవనంలో సమాజం, తల్లిదండ్రులు, కుటుంబాల అంశాలపై కూడా ప్రవచనాలు ఉంటాయని వివరించారు. దివ్య సత్సంగ ప్రవచనాలను ఆర్ విభాగాలుగా విభజించి ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు తెలిపారు. సానుకూల మానవ జీవన నిర్మాణ శైలి, జీవనంలో ప్రగతి సాధించేందుకు వ్యక్తిత్వ వికాసాన్ని ఎలా పెంపొందించుకోవాలనే అంశాలతో పాటు కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని క్రోడీకరించుకుని జీవనగమనంలో ముందుకు వెళ్లే విధంగా అనేక ప్రవచనాలు ఉంటాయని అన్నారు. చతుర్మాసంలో 30 రోజులపాటు యోగా సాధన, ధ్యానం, ప్రాణాయామం,మితభోజనం వంటి అనేక క్రియల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని అన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : కల్నన్ ప్రశాంత్


బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ హై స్కూల్ విద్యార్థి కేబినెట్ సభ్యులను సన్మానిస్తున్న కల్నన్ ప్రశాంత్, టీ.ఏ.రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్,జూలై 5 ప్రభాతవార్త:** విద్యార్థులకు విలువలతో కూడిన సాంకేతిక నైపుణ్యాలు విద్యను అందిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆర్మీ రిటైర్డ్ అధికారి కల్నన్ ప్రశాంత్ పెట్‌కర్ తెలిపారు. శనివారం బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్‌హై స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన క్యాబినెట్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు జాయితీ, నిబద్ధత నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించాలంటూ ప్రదర్శన పలువురిని అలరించాయి. సెయింట్ పీటర్స్ హై స్కూల్ చైర్మన్ టీ.బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ టీ.ఏ.రెడ్డి, డైరెక్టర్ టీ.అరుణారెడ్డి, ప్రిన్సిపాల్ కె.సువర్ణలు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లష్కర్ బోనాల జాతరకు ఆహ్వానం

**బేగంపేట జులై 5,ప్రభాతవార్త :**
ఈ నెల 13న జరగనున్న సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాఢ బోనాల జాతరకు విచ్చేయాలంటూ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డికి మహంకాళీ ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి,వేద పండితులు వేణుమాధవశర్మ,ప్రధాన అర్చకులు రామతీర్థ శర్మ నితీష్‌భోలే తదితరులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాసానికి వెళ్లి లష్కర్ బోనాల ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో కిషన్ రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందజేసారు.

### శ్రీఉజ్జయినీ మహాకాళీ బోనాల జాతరకు రావాలంటూ ఉపముఖ్యమంత్రి భట్టికి ఆహ్వానం


ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మల్లుకు లష్కర్ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఈ ఓ తదితరులు.

**బేగంపేట జులై 5,ప్రభాతవార్త :**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఈ నెల 13న జరగనున్న ఆషాఢ బోనాల జాతరకు విచ్చేయాలంటూ ఉప ముఖ్య మంత్రి భట్టివిక్రమార్క మల్లుకు శనివారం శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి వేద పండితులు వేణుమాధవశర్మ,అర్చకులు రామతీర్థ శర్మ తదితరులు ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా అర్చకులు భట్టి విక్రమార్క మల్లుకు ఆశీర్వచనం అందజేసారు.అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.

### సామాజిక సమరభేరి కాదు అధికార దుర్వినియోగ భేరి

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** ప్రజాధనం దుర్వినియోగం చేసి, కాంగ్రెస్ నిన్న నిర్వహించినది సామాజిక సమరభేరి కాదని, అధికార దుర్వినియోగ భేరి అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా విమర్శించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గ్రామాల నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ కోసం విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు తమ పదవులు కాపాడుకోవటానికి ఢిల్లీ పెద్దల అడుగులకు మడుగులొత్తుతూ, తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెడుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఇతర పార్టీలు స్పందించక పోవటం విచారకరమన్నారు. ఈ సమరభేరిలో ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడకుండా హిందీలో ప్రసంగించటం చూస్తూ ఉంటే తెలుగు భాషపై కాంగ్రెస్‌కు ఉన్న చిన్నచూపు స్పష్టమవుతోందన్నారు. అధికారంలోకి వచ్చి, కాంగ్రెస్ చేసిన పనులు కేవలం పథకాల పేర్లు మార్చటం, విగ్రహాలు పెట్టటం తప్ప సాధించిన ప్రగతి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కి, తమ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకుంటూ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

### డాక్టర్ మనోజ్‌రెడ్డికి మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. డాక్టర్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ జిల్లా బ్రాంచి ఆధ్వర్యంలో సంస్కృతి రాజ్‌భవన్‌లో నిర్వహించిన మెడికల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి చేతుల మీదగా డాక్టర్ మనోజ్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ తన సేవలు గుర్తించి, మెడికల్ ఎక్సలెన్స్ అవార్డుతో తనను సత్కరించటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

### విద్యార్థులు ఏఐ, రోబోటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**జగద్గిరిగుట్ట, జూలై 5, ప్రభాతవార్త**
విద్యార్థులు ఏఐ, రోబోటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బిఆర్ఎస్ విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భగత్ సింగ్ మార్గ్ లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ.ఐ.)తరగతి గదులను బిఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా విద్యాధికారిణి ఐ.విజయకుమారి,కార్పొరేటర్ జగన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జె.నాగరాజు, కోశాధికారి పరుశురాం గౌడ్, వివిధ ట్రస్మా కే. శ్రీనివాస్ చారి, నర్సిరెడ్డి, శ్రీకాంత్, సుశీల్ కుమార్, కాశిరెడ్డి, సుబ్రహ్మణ్యం, షోయబ్, అంజన్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, ధన్ సాగర్ తో పాటు వివిధ పాటల కరస్పాండెంట్ లు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చేనేతకు కేంద్రం జిఎస్టీ తగ్గించాలి : మంత్రి సీతక్క


స్టాల్స్‌లో చేనేత చీరలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై 5,ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి నేత పరిశ్రమకు తోడ్పాటు అందించాలని కేంద్ర ప్రభుత్వం చేనేతకారులకు జీఎస్టీని తగ్గించాలని మంత్రి సీతక్క అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్ ను శనివారం ఆమె ప్రారంభించారు.. ఇక్కడి చీరలు చాలా అందంగా ఆకట్టుకునేలా ఉన్నాయని, చేనేతకారుల ఉత్పత్తులను తిలకించి అభినందించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణా ప్రభుత్వం చేనేతకళాకారులకు చేయూతను అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని, దేశంలోని ప్రముఖ రాష్ట్రాలకు చెందిన చేనేతకారుల ఉత్పత్తులకు ఒక వేదికగా చేర్చి వినియోగదారులకు అందించడం మంచి పరిణామమన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 70స్టాల్స్ ఏర్పాటుచేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమర్ తెలిపారు. బోనాలు, వరలక్ష్మి వ్రతం, పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నారాయన పేట్, బెనారస్, కొలకతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్ ఏర్పాటుచేశామని, ఈనెల 13 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో శ్రీనివాసరావు, డాక్టర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం ఫుట్‌పాత్‌పై ఉండటంతో దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి లిబర్టీ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదురు ఫుట్‌పాత్‌పై ఒక వ్యక్తి మృతిచెంది ఉన్నాడని అంబులెన్స్ సిబ్బంది నుండి ఫోన్ ద్వారా సమాచారం అందుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి చూడగా అక్కడ ఒక 40 ఏళ్ల పురుషుడు చనిపోయి ఉండటంతో చుట్టు పక్కల వారిని విచారించారు. ఎవరూ ఆ వ్యక్తి గురించి వివరాలు తెలపకపోవటంతో మృతుడు ఉన్న స్థితిని బట్టి ఆ వ్యక్తి ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తి అని, ఆ ప్రాంతంలోనే బిచ్చగాడిగా జీవించేవాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ హాస్పటల్ మార్చురీలో భద్రపరిచామని, అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## నాలాలో కాలిపోయిన మృతదేహం

**బేగంపేట జులై 5,ప్రభాతవార్త :** బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా ఇందిరమ్మ నగర్ నాలాలో సగం కాలిపోయిన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది.శనివారం సాయంత్రం సమయంలో నాలాలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని బేగంపేట పోలీసులకు తెలియజేసారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఇందిరమ్మ నగర్ నాలాలో సగం కాలిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మృతదేహం ఏదైనా శ్మశాన వాటిక నుంచి నాలాలోకి కొట్టుకు వచ్చిందా.లేక మరేదైనా కారణమా అన్న వివరాలు తెల్సుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## రంగస్థల నిపుణుడు గరిమెళ్ళ రామమూర్తి : డా. కె.వి.రమణాచారి


రంగస్థల పురస్కారంతో రఘురామ్‌ను సత్కరిస్తున్న దొర, రమణాచారి, విజయభాస్కర్, కోటేశ్వరరావు తదితర అతిథులు

**నాంపల్లి, జూలై 5 ప్రభాతవార్త :** రంగస్థలంలో ఎన్నో విభాగాలను, విభిన్న భూమికలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించి ప్రశంసలందుకుని తన నటనా నాటక కౌశలంతో అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలు, బహుమతులను అందుకున్న రంగస్థల నిపుణుడు గరిమెళ్ళ రామమూర్తి అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. రసరంజని సాంస్కృతిక సంస్థకు నిర్వాహకుడిగా పదేళ్లు అనేక పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక, సాంఘిక నాటకాలు ప్రదర్శించుటలో కీలకపాత్ర పోషించి తెలుగు కళామతల్లికి అనితరసేవ చేశారని కొనియాడారు. 2005 నుండి క్రమం తప్పకుండా ఇప్పటివరకు 20మందికి ఆయన పేరుమీద ప్రతీ సంవత్సరం రంగస్థల రంగానికి సేవలందిస్తున్న ప్రముఖులకు గరిమెళ్ళ రామమూర్తి రంగస్థల పురస్కారాలను ప్రదానం చేసినట్లు రమణాచారి పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఒక సాంస్కృతిక, సాహిత్య కళాసంస్థ నిర్వాహకుడు రంగస్థల, సాంస్కృతిక, సాహిత్య రంగాలకు విశేష సేవలందిస్తున్న మద్దాళి రఘురామ్‌ను ఎంపికచేసి ఈ పురస్కారం అందజేస్తున్నట్లు వివరించారు. ప్రఖ్యాత రంగస్థల కళాసంస్థ రసరంజని హైదరాబాద్ నిర్వహణలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ప్రఖ్యాత రంగస్థల నిపుణుడు గరిమెళ్ళ రామమూర్తి 89వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ఐపిఎస్ అధికారి హెచ్.జె.దొర విశిష్ట అతిథులు ఓలేటి పార్వతీశం, డా. దీర్ఘాసి విజయభాస్కర్, కోట్ల హనుమంతరావు, రామకోటేశ్వరరావు తదితరులతో కలిసి కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్‌ను ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక 21వ గరిమెళ్ళ రామమూర్తి రంగస్థల పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు సాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే పి.టి.మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వంలో రూపొందిన జనరల్ బోగీలు నాటిక అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను తన్మయుల్ని చేసింది.

# దేవుడి చిత్రపటాల వెనుక గంజాయి

**-పూజలు చేస్తున్నట్టు డ్రామా..పోలీసుల ఎంట్రీతో దూల్‌పేట గంజాయి స్మగ్లింగ్‌లో కొత్త పంథా**



**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త**
ఎక్సైజ్ అధికారులు దులో పేట్ లోని ఆ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు.. ఇంటి వాళ్ళందరూ ఎలాంటి ఐరానా పడకుండా ప్రశాంతంగా కూర్చున్నారు.. అందులో ఒకరు పూజ గదిలోకి వెళ్లి బ్రహ్మాండమైన పూజలు చేస్తున్నాడు.. అప్పటికి అధికారులకు అర్థం కాలేదు.. ఇల్లు మొత్తం వెతికినప్పటికీ ఎక్కడ కూడా గంజాయి ఆనావాళ్లు దొరకలేదు.. అరవీర భయంకరంగా పూజలు చేస్తున్న వ్యక్తిని అనుమానంగా చూశారు..అప్పుడే అనుమానం వచ్చి అధికారులు పూజా గదిలోకి వెళ్లారు. అప్పుడు అతని ముఖ కవళికలో మార్పు వచ్చింది. పూజగది మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి గంజాయి ఆనవాళ్లు దొరకలేదు.. ఎందుకో అనుమానం వచ్చి దేవుళ్ళ చిత్రపటాలను పక్కకు కొద్దిగా జరిపి చేశారు.. పేపర్‌తో చుట్టబడిన బండిల్స్ కనపించాయి. అవి ఏంటి అని చూస్తే అందులో గంజాయి ఉంది. దేవుళ్ల చిత్రపటాల వెనకాల గంజాయి పెట్టి పూజలు చేస్తున్న రోహన్ సింగ్. గంజాయి దందా చేస్తున్న రోహన్ సింగ్‌ని చివరికి ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతనితోపాటు ఒడిస్సా నుంచి పెద్ద మొత్తంలో గంజాయి తీసుకొచ్చి పూజ గదిలో చిత్రపటాల వెనకాల దాచిన యశ్వంత్‌సింగ్‌ను అరెస్టు చేశారు. ఈ ముఠా గంజాయిని ఒరిస్సా నుంచి తెచ్చి హైదరాబాద్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయిని 5,10, 15, 20 గ్రాముల్లో చిన్న ప్యాకెట్లను తయారు చేస్తారు. అలా తయారుచేసిన గంజాయి ప్యాకెట్లను గచ్చిబౌలి మాదాపూర్ తోపాటు ఐటి ఏరియాలో ఉన్న తమ ఏజెంట్లకు సరఫరా చేస్తారు. అక్కడ గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతాయి.అలాగే ఇదేరోజు శివలాల్ నగర్లో మరోసారి సోదాలు నిర్వహించారు. సంకీర్‌సింగ్, సుశీల్ సింగ్,, సరిత, ఒరిస్సా చెందిన స్వప్న మండల్ అలియాస్ మీనా బాయ్ నుంచి 10 కేజీల గంజాయి పట్టుబడింది. ఒక్కరోజే రెండు కేసుల్లో 21.334కేల గంజాయి, విలువ సుమారు 22 లక్షలు. ఇదంతా బలరాంగల్లీ ప్రాంతంలోని ఇంటి నెంబర్ పవన్‌సింగ్ ఇంట్లో దాడి చేశారు. ఇక్కడ కూడా ఇదే తరహాలో 2 కేజీల గంజాయి దొరికింది.ఈ కేసులో కౌశిక్‌సింగ్, శ్వేతాబాయ్, అఖిలేష్, దుర్గభవాని, మనోసింగ్ అరెస్టు అయ్యారు.

### జెన్‌కో నూతన డైరెక్టర్‌కు ఆర్‌పిఐ అభినందనలు


పల్లి బాల్‌రాజ్‌ను అభినందిస్తున్న శుభాకాంక్షలు తెలియజేస్తున్న టి.పద్మారావు తదితరులు

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:**
జెన్కోకు నూతన డైరెక్టర్‌గా నియమితులైన పల్లి బాల్‌రాజ్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర జెక్కోకు డైరెక్టర్‌గా పిల్లి బాల్‌రాజ్ పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా పల్లి బాల్‌రాజ్‌కు ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటారం వినయ్‌కుమార్ తదితరులు ఆయనకు బోకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనలు తెలియజేశారు.

### వైభవంగా ప్రారంభమైన ఆషాడి త్రిరాత్రి ఏకాదశి మహోత్సవాలు



**చార్మినార్,జూలై 25 ప్రభాతవార్త :** పురానాపూల్ గల్లీవీధిలోని శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయంలో శనివారం అత్యంత వైభవంగా ఆషాడి త్రిరాత్రి ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి.శనివారం ఆలయంలో మండప స్థాపన,పంచ సూక్త, మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి.పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయం కమిటి చైర్మన్ పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ ఈ నెల ఏడవ తేదీ సోమవారం రోజున ఆలయంలో శ్రీ రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని,అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.కాగా ఉత్సవాలలో ఆలయ కమిటి అధ్యక్షులు ఠాకూర్ రంజిత్ సింగ్,ప్రతినిధులు సందీప్ గౌడ్,దిలీప్ సింగ్,టి.రాజేందర్ పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
గాజులరామారం సర్కిల్-26

నిట్ నెం & తేదీ: 09/DB/EE/GJRM/CIRCLE-26/KPZ/GHMC/2025-26, తేదీ: 05.07.2025.
పనిపేరు : జీబ్రా క్రాసింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, సిసి రోడు వేయడం. అంచనా మొత్తం (లక్షలలో) : రూ.45.50. ప్రారంభ తేది మరియు సమయం : 07.07.2025 మ.3.00గం. టెండర్ స్వీకరణకు చివరి తేది, సమయం: 16.07.2025 మ.03.30గం. EE పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం, సర్కిల్-26, GHMC. 9849906776. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, GHMC.
DIPR.NO.4670-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 05.07.2025

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Chaya W/o. Umesh Kulkarni, Resident of H.No. 2-2-647/8/4, Flat No. 202, DMR Suryodaya, Street No.05, Near Anantha Sai School, Central Excise Colony, Bagh Amberpet, Hyderabad-500013, Telangana, I am the natural Mother of Anish Kulkarni who is aged about 17 years. In my son's Marks Memo, my name is mentioned Chaya henceforth known as Chayadevi Desai to be submitted in All Official Documents by way of Notarised Affidavit dated : 05-07-2025.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, SANGAREDDY DISTRICT, AT: SANGAREDDY
OS. No. 5 of 2025
Between:
Movva Sunita (Tatineni Sunita) ...Plaintiff
AND
Dandamudi Ramakrishna Prasad and 5 others ...Defendants
To.
1. Dandamudi Ramakrishna Prasad, S/o. Venkata Narasimha Rao, aged about 74 years, R/o. H. No 2-5, Penmethsa Village, Vuyyuru Taluk, Krishna District-521165. (Defendant No. 1)
2. M. Narayana Reddy S/o. Narasimha Reedy, aged about 74 years, R/o. H.No.3-13, Hanuman Nagar Colony, Dilshuknagar, Ranga Reddy District-500060. (Defendant No. 2)
Whereas the plaintiff has filed the above said suit i.e., OS No. 5 of 2025, against the above-mentioned persons before the above-mentioned Court. For Declaration Of Title, Recovery Of Possession And Perpetual Injunction against Schedule Property and the notices sent to Defendant No. 1 and 2 have been returned and the plaintiff has filed petition seeking substitute service of notice on Defendant No. 1 and 2 as you are wantedly returning the summons and notices sent to you by post and the Hon'ble Court was pleased to order substitute services on all of you by way of paper publication, Hence the present Paper Publication is being caused intimating you that the above said case, and it is posted for your counter and written statement if any, on 06/08/2025, before the above mentioned Court, so you the above named Defendant No. 1 to 3 are hereby intimated that you are required to show cause on 06/08/2025 at 10:30 AM, in person or by a pleader/advocate, duly instructed, as to why the reliefs prayed for, in the said suit and petition filed by the plaintiff should not be granted. Take notice that, in case of default by you the said suit and petition will be disposed off on merits.
SCHEDULE OF PROPERTY
All that Plot No.7-B, admeasuring 500 Sq. Yds. in Sy. No.192, of Bhavani Nagar, Kollur Village, Ramachandrapur Mandal, Sanga Reddy District, bounded by: North : 60 wide Road, South : Plot No.12, East : Plot No.6, West : Plot No.8
// By order of the Court //
M/s Karavadi & Associates
Anup Koushik Karavadi,
K.M Ramya Sravani, Advocates
1st Floor, Pooja Residency, Plot No C-8, Westend Meadows Road, Behind Power Welfare Society, Kokapet, Narsingi, Hyderabad, Telangana 500075.

In the Court of the Honorable XXIst Jr. Civil Judge, CCC At Hyderabad
OS No. 2257 OF 2025
Between:
Bhushanam Vijaya Laxmi & 2 Others ...Plaintiffs
And
1. The Tahasildar O/o Tahasildar, Khairthabad, Hyd.
2. All Concerned and Necessary parties ...Defendants
NOTICE TO THE DEFENDANTS
The plaintiffs here in filed a declaration suit to declare them as Legal heirs of deceased Bhushanam Jagadish Kumar. Hence that this Honorable Court herein was pleased to directed plaintiffs to issue notices to defendants, all the concerned interested parties to appear before the Honourable Court at 10.30 A.M. on 14-07-2025 without fail by person or through their counsel or else this Honorable Court may pass adverse orders against the defendants by setting them experte.
*By the Orders of the Honorable Court.*
1. M. Suresh Sagar, Advocate
2. P. Ashok Kumar, Advocate
Secunderabab (SBA)
798862051, 8309867353
Counsel for the Plaintiffs

PUBLIC NOTICE
Iam Dukka Mounika D/o Dukka Purushotham, age-30 years. I lost my certificates while travelling from Dilsuknagar to Malakpet SSC certificates-H.No-1033105216 Board of intermediate-1218210124 School conduct certificate-Ad. No- 717 School bonafied certificate - Ad. No-717 Inter bonafied and conduct certificate- 2533 Bachelor of dental surgery passed certificate- H.No-14703027
B.d.s marks memorandum
B.d.s migration certificate
B.d.s registered doctor certificate-rg no-A 5532.
If any one found this please hand over to this address -flat No 403, 4th floor, Bramareshwari Sai Mulayam, fathullaguda, Bandlaguda, Nagole, Medchal Malkajgiri District - 500068.
D. NAGESHWARI
ADVOCATE
Phone No 98496 64378

